# లంచావతారం

-డా॥ బి. దామోదరరావు

అడవిలో ఒంటరిగా తపమొనరించసాగెను నిశ్శబ్ద చింతామణి. చుట్టూ చేరిన క్రూర మృగములు సైతము తోకముడిచి వెళ్ళిపోసాగెను. ప్రకృతి పరవశించి పోవుచుండెను. గాలిదేవుడు, వరుణదేవుడు కరుణ చూపసాగిరి. దైవం అనుకూలించు సమయమాసన్న మైనట్టుల చింతామణి చుట్టూ పుట్టి పెరిగింది. తలపై జుట్టువలె, బవిరి గడ్డంవలె, అందులో నిశీధిలో చుక్కల్లా, అక్కడక్కడ తెల్లవెంట్రుకలు, ఏడు సంవత్సర ముల ఏడు నెలల ఏడు దినముల తపస్సిది.

ఇంద్రుడికి నిద్ర కరువైపాయెను; ఎవరు తపమాచ రించిన ఇంద్రునికే కదా బెదురు, అంతే ఒకనాడు ఓ భయంకర క్రోధము, అనగా పంది, అటువైపు వచ్చెను, వచ్చి రావటము తోడనే పుట్టపై తన ముట్టెతో మొట్టెను. అంత మునికి తపోభంగమాయెను. ఆయన అపర దుర్వాసులైపోయి, నిగ్రహాన్ని దైవ విగ్రహానికి వదిలి నిశ్చింతగా అంతవరకు సాధించిన తపోబలంతో, ఆ క్రోధమున భూలోకమున పుట్టుమని ఆజ్ఞాపించెను. అంతేగాదు, ఆయన ఎల్ అవతారం పేర ప్రసిద్ధుడు కాగలడని ఆశీర్వదించెను.

పైగా, సాంఘిక సంక్షేమ శాఖలో 'షెడ్' వనజాక్షిని పెండ్లాడి ఆమె చేతి 'ఫుడ్' తినవలెనని శాసించెను. వారికి కల్గిన సంతానం వరుస క్రమములో, 'ట్రెజరీ' ఎక్సయిజ్, పోలీసు, రెవెన్యూ, రవాణా, రిజిస్ట్రేషన్ తదితర ముఖ్య శాఖల్లో ఉన్నత పదవులు పొందగలరని అయాచిత వరం అందిచ్చెను. మనుమలకు, విద్య, వైద్యం వంటి శాఖల్లో పదవులు లభించునని పేర్కొనెను. భావి అంతా కనుల ముందు కదలాడగా, ఎల్.అవ తారం, భూలోకమందలి, ఒకానొక రాష్ట్రంలో, అతి సహనం కల్గిన జాతిలో, మధ్యతరగతి కుటుంబంలో ఆశల పల్లకిలో ఊరేగే వంట ఇంటి మూలగదిలో- మూల నక్షత్రంలో, చడీ చప్పుడు కాక జన్మించెను. తల్లిదండ్రి, పేరుపెట్టువేళ తండ్రి చేతి ఉంగరం లాగి వేసెను. అందువల్ల తల్లిదండ్రులతని సూక్ష్మబుద్ధి గ్రహించి, అతనికి 'అవతారం' అని పేరుపెట్టిరి. ఇంటిపేరు 'లుబ్ధు' కాబట్టి 'ఎల్.అవతారం' కాస్త కోటి కాంక్షలతో పెరిగి పెరిగి 'లంచావతరాం' నామంతో వర్ధిల్లసాగెను.

ఈ నవ్యజీవి అంచలంచలుగా లంచావతారం ఎత్తినవాడు కాబట్టి తన ప్రథమ ప్రతాపాన్ని అయాచిత వరంలా లభించిన 'ధనయజ్ఞం'లో చేతివాటం చూపిం చటంతో ప్రారంభించెను.

ఇక ధర్మపత్ని అతన్నే ఆదర్శం చేసుకుంది, కాబట్టి సదరు పతి అడుగు జాడల్లో నడుస్తూ సాంఘిక సం క్షేమ శాఖను కాస్త విద్యార్థుల పాలిట సంక్షోభ శాఖగా మార్చివేసెను. కుమారరత్న బృందం అన్ని విద్యల్లో ఆరితేరి తమ తమ శాఖల్ని కొమ్మలు, రెమ్మల్లా పూలు పండ్లతో వర్ధిల్లేలా శాయశక్తులా చెమటోడ్చి మరీ వృద్ధి చేసిరి. 'టేబిల్' పైనుండే కాక, కింద నుండి, ఇరుపక్కల మహా సందడిగా 'బిజీ-బిజీ'గా మార్చివేసిరి.

## ఆత్మావలోకనం

హింసను శ్వాసిస్తూ
దుర్మార్గాన్ని బహిరంగంగా విసర్జించే
సామాజిక పశువులు
సంచరిస్తున్న నా దేశం-
అవినీతిని ఊపిరిగా మార్చుకుని వేస్తున్న
చివరి అడుగులను చూస్తుంటే
భయమేస్తోంది.
నిప్పులు చెరుగుతూ పైకెగసే నేను
అదే మంటల్లో కాలిపోతున్న వైనం
ఆలోచనని రేకెత్తిస్తుంటే
నివ్వెరపోవడానికేముంది
విడదీయలేని ఉచ్చుల్లో
నా ఒకే ఒక్క తల!
ప్రతీ సందేహమూ
ప్రశ్నగానే మిగిలిపోతుంటే
శాంతి మార్గాన్ని ఎన్నుకున్న నేను
ఒంటరిగా మిగిలిపోతున్నపుడు
రెప్పల మీద శాశ్వత నిద్ర
వాలిపోతే బాగుండును!!

-మండాది గోపీనాథ్

ఈ అయాచిత సంపాదన చూచి, కుబేరునికి గుండె పోటు రాగా, అపర ధన్వంతరి కనిపెట్టి, ఇది భూలోక మందలి, 'కరప్షన్' అనువ్యాధి ప్రభావితచోద్యమై యుండుననెను. కుబేరుడు గుబేలున కుప్పకూలెను. అతని వాహనం నరుడు సంతోషముతో గంతులు వేయ సాగెను.

ఈ దివ్యలోక సంక్షోభ కారణంగా, అర్భకులైన దీనమానవులు, నిత్య దరిద్రులు, ఆత్మహత్యలకు పాలు పడిరి. కుబేరుని కల్గిన పక్షవాతం, భూలోకంలో పక్షపాతమై నిమ్నజాతుల, పేదల పీడింపసాగెను. ఈ బలవంతపు మరణాల ఆత్మలు, పరలోకం చేరలేక, భూలోక పరిధిలో తిరుగాడసాగెను. ఈ ఆత్మల సంగతి, 'మీడియా' వల్ల మరికొందరు ధర్మాత్ములకు తెలిసి గుండెలాగిపోయెను. కానీ, ఆత్మలు అంతదూరం పోలేకపోయెను. దాంతో దేవలోకంలో, నరకలోకంలో 'సీట్ల' భర్తీ ఆగిపోయెను.

'కరప్షన్' బాధిత మరణాలకు పుణ్యగతులుండవనే చట్టం ఉంది కదా, అనీ, ఊసురుమనిరి. అంత, యముడు, ఆగమేఘాల్లో వెళ్ళి విష్ణువును పాలసముద్రం పైనుండగా దర్శించెను. అంత "ఏమిటీ యమా, యమ అర్జెంట్‌గా ఏతెంచితివని" యడిగెను.

భూలోకంలోని ఆంగ్ల భాష దాటికి, విష్ణుమూర్తి కూడ అతీతుడు కాదని, తెలిసినవాడై, "వెరీ సింపుల్ స్వామీ, భూలోకమున 'కరప్షన్' అనే ముదురు వ్యాధి అందరికి అంటుకునే అంటువ్యాధిలో పరిణమించినది స్వామీ. దాని బారి నుండి జనాన్ని రక్షింపబడక మరిన్ని కరప్షన్ బాధితులకు, మరియొక 'కరప్షన్' లోకం కొత్తగా సృష్టించవలసి రావొచ్చు మహాప్రభో" అని విన్నవించుకొనెను. అంత, మహావిష్ణువు ఉపాయం తట్టక, నారదుల వారు ముల్లోకములు తెలిసినవారు కావున అతని సలహా స్వీకరింపుమనెను. యముడు అటులనే, అని నారదుల వారిని, వెతికి వెతికి, మేఘాల మధ్య విశ్రమించిన వేళ, కలసుకొని, సలహా అడిగెను. అంత నారదుల వారు "భూలోకంలో ఆదాయపు పన్ను అధికారులని ఉందురు. సి.బి.ఐ. అధికారులని ఉందురు. వారు ప్రస్తుతం నిద్రావస్థలో ఉండినారు, వారి నిద్ర మత్తు వదలించే 'జనచైతన్య' మాత్రల్ని సృష్టించి పంపిణీ చేస్తే, ఈ వ్యాధి తక్షణమే నిరోధించవచ్చును. అపుడు నీ ఆశయము తప్పక నెరవేరును" అని తెలిపెను.

యముడు వెంటనే, యమసదనమున అత్యవసర సమావేశం ఏర్పాటుగావించి, చిత్రగుప్తుని వద్ద గల నిక్కచ్చి లెక్కలు తెప్పించెను. అన్యాయపరులు, భూకబ్జాదారులు, అవినీతిపరులైన అధికార గణము, రాజకీయ నాయకులు కలసికట్టుగా ఈ వ్యాధికి కారకులని గుర్తించిరి. వారందరి సంపదలు 'జనచైతన్య బృందం' స్వాధీనం చేసుకొని, సామాన్య జనానికి పంచుటమే, సరియైన మార్గమని తెలుసుకొనిరి. సభ వారిని ఏక గ్రీవముగా తీర్మానించెను.

భూలోకంలో అలజడి పుట్టెను. మహర్షి, 'చైతన్య మహర్షి' అవతరించెను. అతని బోధనలు జనంలో జవం జీవం నింపాయి. ఆధ్యాత్మిక ప్రసంగాల కన్న, అవినీతిని ఎదుర్కొనే పద్ధతులు, అవి సాగే విధానాలు, అందుకు సహకరించే వ్యక్తులు, వారి విధి విధానాలు గురించి సూక్ష్మంలో మోక్షంగా చెప్పి, జనాన్ని జాగృతం చేశాయి. వీధిపోరాటాలు, ధర్నాలు, నిరాహార దీక్షలు మొదలయ్యాయి. జాతి, కుల, వర్గ రహితంగా, జనం అంతా కదిలివచ్చారు. 'మీడియా' సహకరించింది. 'కోర్టులు' తమవంతు బాధ్యత నిర్వహించాయి. 'లంచం' అడిగే వాళ్ళ 'నాలుకలు' తెగకోస్తామని, చేతుల్ని నరికి వేస్తామని బెదిరించారు. వారి పిల్లల చేత, గాడిదల మీద ఊరేగింపచేశారు. మొఖాన ఉమ్మేలా చేశారు. అంతే, క్రమంగా– భూలోకంలో, 'లంచావతారాల' ఆటకట్టింది. వాళ్ళల్లో చాలామంది ఆత్మహత్యలు చేసుకున్నారు. కొందరు, సంపదల త్యాగం చేసి, ప్రజల్లో కలసిపోయారు. మరికొందరు, 'స్థితప్రజ్ఞులై' తపోవన వాటికలకు తరలి వెళ్ళారు. ఇది తదనంతర పిల్లలకు 'పురాణ కథ'గా మిగిలిపోయింది. ఒక చరిత్ర గతి మార్చే శక్తి జనబలానికే ఉందని నిరూపించింది. దాన్ని దేవగణం కూడ ఆమోదించి ఆశీర్వదించింది. ■

## ఆకాశం అంచుల్లోంచి..!

హాలికుల ఆత్మహత్యలతో
ఏర్పడ్డ శవాల గుట్టలపై
విలపిస్తున్న పసిపాపల
చిట్టి చేతుల ఆర్తనాదాలు
పసిగట్టిందేమో నింగి
ఆకాశం అంచుల్లోంచి...
అశ్రుబిందువులు రాలుతున్నాయి
మేముసైతం చేయూతకిక
సిద్ధమంటూ పారుతున్నాయి

–ఒంటెపాక మల్లయ్య